# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-11-05, జువ్వలపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కార్తీకమాసం లక్ష్మీ ప్రదమైనది, ఈ మాసంలో పార్వతీ పరమేశ్వరులనుగాని, లక్ష్మీ నారాయణులను గాని ఆరాధించటం వలన మన మనస్సులో ఉన్న అలక్ష్మి బయటకు వెళ్ళిపోతుంది, లక్ష్మి మనలను వరిస్తుంది. కొంతమంది అడిగితే ఇస్తారు, అడగకపోతే ఇవ్వరు. ధర్మశాస్త్రంలో ఏమని ఉందంటే మనం వెళ్ళి అడిగితే ఇచ్చేవాడు దాతకాదు, మన అవసరం ఏమిటో తెలుసుకొని మనం అడగకుండానే ఇచ్చేవాడు దాత అని చెప్పారు. అడిగిన తరువాత ఇచ్చేవాడు ధర్మమూర్తి అంటే ధర్మం తెలిసినవాడు. కొంతమందికి అర్హత ఉంటుంది, అడిగినా ఇవ్వరు, వారు అధములు. కొంతమంది మంచి పనులు చేయలేరు, ఎవరైనా మంచి పనులు చేద్దామనుకొన్నా చెయ్యవద్దు అంటూ వచ్చి అడ్డం పడిపోతారు వారు అధమాధములు అని ధర్మశాస్త్రంలో నాలుగు రకాలుగా చెప్పారు. ప్రతీ మనిషికి మూడు దేహాలు ఉంటాయి. రక్తమాంసములతో కూడి ఉన్న దేహాన్ని స్థూలశరీరం అంటారు, మనస్సును సూక్ష్మశరీరం అంటారు, ఇంకా లోపలకు వెళితే యింకో శరీరం ఉంది, దానిని కారణశరీరం అంటారు, కారణశరీరం అంటే అజ్ఞానం. అజ్ఞానాన్ని బట్టి మనస్సు వస్తుంది, అజ్ఞానాన్ని బట్టి దేహం వస్తుంది. ఎంతకాలం అయితే మనలో అజ్ఞానం ఉందో అంతకాలం మనస్సు ఉంటుంది, దేహం ఉంటుంది, పునర్జన్మలు ఉంటాయి, ఇతరలోకాలు ఉంటాయి. దేహయాత్ర కోసం మనం కొన్నిపనులు చేసుకోవాలి. దేహయాత్రకోసం మనపని మనం చేసుకొంటూ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉంటే విసుక్కోకుండా వారికి సేవచేస్తే దేహం శుద్ధి అవుతుంది. యజ్ఞకర్మలు అంటే మీ పనులు మీరు చేసుకొంటూ స్వార్థం లేకుండా సమాజపరంగా పనులు చేస్తూ ఉంటే వాటివలన మీ మనస్సు శుద్ధి అవుతుంది. యజ్ఞకర్మలు చేయటం వలన పూర్వజన్మల నుండి మనకూడా వచ్చిన దోషాలు అన్నీ పోతాయి, జీవలక్షణాలు తగ్గిపోతాయి. మీరు ఏదో కర్మ చేస్తూ యజ్ఞకర్మలు చేస్తున్నాము అని అనుకోకూడదు, మీరు యజ్ఞకర్మలు చేస్తున్నారు అని భగవంతుడు అనుకోవాలి.

మాకు సుఖం లేదు, శాంతిలేదు అని చాలామంది అంటారు. అధికారం ఉన్నవారికి ఇదే పని, అధికారం లేనివారికి ఇదే పని, ధనం ఉన్నవారికి ఇదే పని, ధనం లేనివారికి ఇదే పని. ప్రపంచంలో సుఖం, శాంతి లేదు. ప్రపంచం కుక్క తోక లాంటిది. కుక్కతోక వంకర ఇంతవరకు ఎవడూ తీయలేదు. ఆత్మలోనే సుఖం, శాంతి ఉంది. నాకు సుఖం లేదు, శాంతి లేదు అని ఏ మనస్సు అయితే అంటోందో అది హృదయంలో లయమయితే, అది ఆత్మాకారం చెందితే అప్పుడు

ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా శాంతే. అప్పుడు ఈ లోకంలో ఉండటం వలన మనకేదో లాభం ఉన్నట్లు అనిపించదు, పోవటం వలన నష్టం ఉన్నట్లు అనిపించదు, అటువంటి సమానస్థితికి మనం ఎదిగిరావాలి. మనం యజ్ఞకర్మలు చేస్తూఉంటే మనస్సు శుద్ధి అవుతుంది, కాని లోపల ఉన్న కారణశరీరం పోవటం చాలా కష్టం. కారణశరీరం ఎలా నశిస్తుంది అంటే మనం ప్రీతిగా బ్రహ్మం గురించి శ్రవణం చేయాలి. మనం భగవంతుడు గురించి శ్రవణం చేసి, శ్రవణం చేసి, ఇంటికివెళ్ళి దానిని మననం చేసి, దానిని సొంతం చేసుకొని, దానిని మీరు అనుభవంలోనికి తెచ్చుకొంటే గాని నీకు అజ్ఞానం నశించదు. ప్రపంచవిషయాలమీద ఉన్న శ్రద్ధలో కనీసం వందోవంతు కూడా మీకు భక్తిమీద లేదు. కొంతమంది సినిమాలకు వెళ్ళే బదులు మీటింగులకు వస్తారు, మంచిదే. కొంతమంది యాంత్రికంగా వింటారు. ఇక్కడ ఏమి చెపుతున్నారు, దానిని మనం ఇముడ్చుకోవాలి, చైతన్యానుభవం పొందాలి అనే జిజ్ఞాస రావటం లేదు. ఇతరుల మాట వదిలి వేయండి భక్తులకు కూడా జిజ్ఞాస రావటం లేదు. మనకు శ్రద్ధ లేదు. అయ్యో మనకు శ్రద్ధ లేదు అనుకోవటం లేదు, మనకు శ్రద్ధలేక భగవంతుడు చెప్పినవన్నీ అబద్ధాలు అనుకోవటం. మనం డబ్బు సంపాదించుకొన్నాము, గౌరవం సంపాదించుకొన్నాము కాని వివేకం సంపాదించుకోలేదు అని మనకు తెలియటం లేదు. ఎంతోకొంత కష్టపడకపోతే డబ్బూ రాదు మరి వివేకం మటుకు ఏమీ కష్టపడకుండా వచ్చేస్తుందా? ఏది సత్యం ఏది అసత్యం, దేనిని తెలుసుకోవటం వలన అజ్ఞానంలో నుండి విడుదలపొందుతాము, దేనిని తెలుసుకోవటం వలన శాశ్వతమైన శాంతి అనుభవంలోనికి వస్తుంది, ఏది మనకు మంచి చేస్తుంది ఏది చెడ్డ చేస్తుంది అనే వివేకం, ఆ విభజన మనలో లేదు. ఎంతసేపు ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల వెంట తిరగటం. అవి ఇవాళ అమృతంలాగ అనిపిస్తాయి, రేపు విషంగా అయిపోతాయి. ఇటువంటి విషయాలు కూడా తెలియని మీకా ఆత్మజ్ఞానం కలిగేది అంటున్నారు.

ఈ ప్రపంచంలో ప్రతీ జీవుడి ముందు రెండు మార్గాలు ఉన్నాయి. శ్రేయోమార్గం, ప్రేయోమార్గం. ఈ ప్రపంచం ఒక్కటే నిజం, మరణానంతర జీవితం లేదు, మన కళ్ళచేత చూడబడేది ఒక్కటే నిజం, మనకు కనిపించనిది ఏదీ లేదు అనుకోవటం, ఇక్కడ అనుభవించే భోగాలే నిజం అనుకొంటూ తాత్కాలిక ప్రయోజనాల కోసం జీవిస్తూ అల్ప సుఖాలకు, స్వల్ప సుఖాలకు బంధింపబడిపోయి జన్మించటం, మరణించటం, మరల జన్మించటం, మరణించటం ఇలా కాలచక్రంలో తిరుగుతూ జీవకోటి వెళ్ళిపోతూ ఉంటుంది, ఇది ప్రేయో మార్గం. ఈ లోకంలో ఉండగానే, ఈ భౌతికశరీరంలో ఉండగానే ప్రేయోమార్గాన్ని విడిచి పెట్టి, తనకు మంచిదికాదు అనుకొన్నది త్యాగం చేసి, భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసి, ఆనందప్రవాహంలోనికి,

సుఖప్రవాహం లోనికి తీసుకొని వచ్చేది శ్రేయోమార్గం. ఇందులో ఏ మార్గం కావాలో నీవే నిర్ణయించుకో నచికేతా అని యమధర్మరాజు అంటాడు. ఇప్పుడు నీవు అనుభవించే అల్పసుఖాలు, ఈ భోగాలు అన్నీ కూడా వడ్డీతో సహా నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. నీ అలవాట్ల వేగం వలన శ్రేయోమార్గంలో భగవంతుడు చెప్పిన మాటలు మొదట నీకు విషం కింద కనిపించవచ్చు, కానీ అవి చివరకు అమృతంలోనికి తీసుకొని వెళతాయి. బుద్ధిలో తేడాలు ఉండవచ్చు, మనస్సులో తేడాలు ఉండవచ్చు, గుణాల్లో తేడాలు ఉండవచ్చు, రంగుల్లో తేడాలు ఉండవచ్చు కాని ఉన్న వస్తువు ఒక్కటే. రాముడి గుణం వేరుగా ఉండవచ్చు, రావణాసురుడి గుణం వేరుగా ఉండవచ్చు. గుణాల్లో తేడా ఉంది కాని అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు ఒక్కడే. రాముడికి భిన్నంగా రావణాసురుడు లేడు. రావణాసురుడి హృదయంలో కూడా రాముడు ఉన్నాడు. అయితే రావణాసురుడిని ఎందుకు సంహరించాడు అంటే మన శరీరం మీద ఉన్న కురుపును ఎలా తీసేసుకొంటామో అలాగ రావణాసురుడు సమాజానికి కురుపు కింద తయారయ్యాడు కాబట్టి వాడిని వాడే శిక్షించుకొన్నాడు. సమాజ క్షేమం కోసం రావణాసురుడిని సంహరించాడు కాని అందులో స్వార్థప్రయోజనం ఏమీలేదు, మనలాగ ఏదో కోపం తెచ్చుకొని సంహరించటం కాదు, విరోధం కాదు.

మనకు మంచి కోరికలు వచ్చినా, చెడ్డ కోరికలు వచ్చినా అన్ని కోరికలు అహంకారం నుండే వస్తాయి. మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు మనకు కోరిక వస్తుంది, కోపం వస్తుంది, కొత్త శరీరాలు వస్తాయి, జన్మిస్తూ ఉంటాము, మరణిస్తూ ఉంటాము, ఇదేపని మనకు ఇంకోపని లేదు. ఈ ప్రపంచం కొన్ని లక్షల సంవత్సరాలు ఉంటుంది, ఈ కాలప్రవాహంలో మన బతుకు ఎంత, మనం ఎంత, మన ఆస్తి ఎంత, ఇందులో మన జీవితం ఏపాటిది? దేనిని చూసి మనం మురిసిపోవటం, ఇంకో గంటకు ఎలా ఉంటామో మనకు తెలియదు, దేనిని చూసి మురిసిపోవటం, మనం మురిసిపోవటానికంటూ ఏమీ లేదు. ఎవరయినా మురిసిపోతూ ఉంటే అది మన అమాయకత్వానికి గుర్తు, మన అజ్ఞానానికి గుర్తు. ఒకవేళ నిజంగా మన దగ్గర కొంత డబ్బు ఉంటే ప్రపంచంలో ఉన్న సంపదతో పోలిస్తే మన దగ్గర ఉన్న డబ్బు ఏపాటిది. ధర్మ, అర్థ, కామ, మోక్షముల గురించి మన శాస్త్రంలో చెప్పారు. మనం మొదటిది వదిలేసాము, చివరిది వదిలేసాము, మధ్యవి రెండూ పట్టుకొన్నాము. నువ్వు చేసేపని కాని, నువ్వు మాట్లాడే మాటకాని, నీకు వచ్చే ఆలోచన కాని ధర్మవిరుద్ధంగా ఉండకూడదు అని భగవంతుడు చెప్పాడు. తెల్లబట్టలు తీసేసి ఎర్రబట్టలు కట్టుకోవటం సన్యాసం కాదు. అర్థకామాలను ఎవడైతే విడిచిపెట్టాడో వాడే సన్యాసి. ధర్మం అంటే దానం అని కాదు మోక్షానుభవం పొందటానికి

ఎలా జీవించాలో చెప్పేది ధర్మం. అర్థకామాలను విడిచిపెట్టినవాడు, వాడు గృహస్థాశ్రమంలో ఉన్నా తెల్లబట్టలు కట్టుకొన్నా వాడు సన్యాసే. అర్థకామాలను మనస్సులో స్మరించుకొంటూ ఎర్రబట్టలు వేసుకొని తిరిగేవాడు సన్యాసి కాదు. లోకంలో అందరూ ఒకే పని చేయరు. వారి పూర్వజన్మ వాసనను బట్టి వాడు ఏదో పని చేస్తూ ఉంటాడు. ఇందులో ఒకటి ఎక్కువ పని అని, ఒకటి తక్కువ అని ఏమీ లేదు, భగవంతుడికి అందరూ సమానమే. మనం ఈ లోకంలోనికి వచ్చాము కాబట్టి పని దగ్గర బద్ధకించకుండా మనం చేయవలసిన డ్యూటీని శ్రద్ధగా, ప్రేమతో చేస్తూ మన నిజమైన ఇల్లు అయిన మోక్షం దగ్గరకు చేరుకోవాలి. లేకపోతే ఇటువంటి శరీరాలు అనేకం వస్తాయి. మనం సంపాదించినది ఏదీ మరణానంతరం మన కూడా రాదు. వల్లకాటివరకు కొంతమంది బంధువులు, స్నేహితులు వస్తారు, ఈ తుక్కును తీసుకొని వెళ్ళి అక్కడ పాడేస్తారు, కాలిస్తే బూడిద అవుతుంది, కప్పెడితే మట్టి అవుతుంది. మరి తరువాత మాట ఏమిటి? తరువాత నీకూడా ఎవరూ రారు అనుకోకు. నువ్వు చేసిన మంచిపనులు, నువ్వు చేసిన చెడ్డపనులు, నువ్వు మాట్లాడిన మంచి మాటలు, నువ్వు మాట్లాడిన చెడ్డ మాటలు నీకూడా వచ్చేస్తాయి, అవి జీవుడిని అంటి పెట్టుకొని ఉంటాయి.

ఈ దేహమే నేను అనుకొంటూ ఎవడైతే ఈ దేహానికి పరిమితమై ఉంటున్నాడో, ఇదే సర్వస్వం అనుకొంటున్నాడో అది మూలపాపం. ఈ మూలపాపం ఉన్నంతసేపు పాపం చెయ్యకుండా ఉండలేడు. ఇప్పుడు మనందరము ఆత్మభావనలో ఉన్నామా? దేహభావనలో ఉన్నామా? మనం ఆత్మభావనలో లేము, దేహభావనలోనే ఉన్నాము. మనకు ఎంతో కొంత పాపబుద్ధి ఉంది కాబట్టి ఈభావనలో ఉన్నాము, పాపబుద్ధి లేకపోతే దేహానికి పరిమితమై ఉండము. ధుర్యోధనుడికి చాలామంది మంచిమాటలు చెప్పేవారు. మీరందరు మంచి మాటలు చెపుతున్నారు. నేను పొరపాటు చేస్తున్నాను అని నాకు తెలుస్తోంది కాని ఈ బుద్ధి పోవటం లేదు, నా బుద్ధి అలా అలవాటు పడిపోయింది అన్నాడు, అదే మాయ, అది ఈశ్వరుడి లీల. ఈ మాయను ఓవర్‌కమ్ చేస్తేగాని మనం పరమాత్మ యొక్క స్వరూపాన్ని పొందలేము. ఇంట్లో వారి వలన కొంతమంది సుఖపడతారు, కొంతమంది బాధలు పడతారు. ఇదంతా ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. మీకు రోజులు బాగా వెళ్ళిపోయినా అదీ నిజంకాదు, మీకు రోజులు కష్టంగా వెళ్ళినా అదీ నిజం కాదు. ప్రపంచం అంతా కూడా స్వప్నమే. అందుచేత మీరు బేధబుద్ధి పెట్టుకోవద్దు. మనస్సు అనే తెరను చింపేయటానికి ప్రయత్నం చెయ్యండి. లోపలఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి రాకుండా మనస్సే మనకు అడ్డు వస్తోంది. మీ డ్యూటీ ఏదో మీరు చక్కగా చేసుకొంటూ, మీ నిజమైనఇంటికి చేరుకొనే ప్రయత్నం మానకండి. మీ నిజమైన

ఇల్లు అంటే మోక్షం. పని చేయండి, ఫలాపేక్ష పెట్టుకోవద్దు. ఇది నా డ్యూటీ, ఇది ధర్మం అనుకొంటూ ఎవడైతే పనిచేస్తున్నాడో వాడికి కర్మఫలం మీద అపేక్ష ఉండదు, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. భగవంతుడు ఈ పని మనకు కేటాయించాడు, ఇది మన కర్తవ్యం అని చెయ్యండి. లోకంలో అందరూ ఒకేపని చెయ్యరు. అందరూ ఒకే పని చేస్తే లోకం నడవదు. నేను ఎవడినో ఉద్ధరిస్తాను అనుకొన్నప్పుడు నువ్వు ఏదో ఒకటి ఆశిస్తావు. రోజూ మీరు మొఖం కడుక్కొంటున్నారు, స్నానం చేస్తున్నారు, ఏదో వస్తుందని ఎదురుచూస్తున్నారా? ఎదురు చూడటం లేదు. రోజూ మీరు చేసుకొనే పని అలా చేయండి, కర్మఫలం మీద కాంక్ష మీకు ఉండనే ఉండదు.

మీ ఇంటి దగ్గర బియ్యం ఉన్నాయి, కూరలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి కాని నిప్పు లేకపోతే వంట అవ్వదు. అలాగే మీకు ఎన్ని అవకాశములు ఉన్నా ఈశ్వరుని దయ లేకుండా మీకు మోక్షం రాదు అంటున్నారు భగవాన్. సత్యం నీ హృదయంలోనే ఉంది. సత్యానికి భిన్నంగా గురువు లేడు. మనందరము ఇప్పుడు అనాత్మ భావనలో ఉన్నాము. అనాత్మ భావన తొందరగా మనిషిని విడిచిపెట్టదు, మనిషిని పీడించేస్తుంది. ఆత్మభావనను ఎవడైతే పెంచుకొంటున్నాడో వాడినే అనాత్మభావన విడిచిపెడుతుంది. ఉన్న వస్తువును ఉన్నట్లుగా ఎవడైతే స్మరించుకొంటున్నాడో, దాని అనుగ్రహం కోసం నిరంతరం పని చేస్తున్నాడో వాడు అనాత్మలోనుండి బయటకు వస్తాడు కాని నిరంతరం ఆత్మ కానిదానిని చింతిస్తూ, ఆత్మ కానిదానికోసం పనులు చేస్తూ ఉన్నవాడు అనాత్మలోనుండి ఎలా బయటకు వస్తాడు. ఈశ్వర భావన ఉన్నవాడు మాత్రమే ప్రకృతిగుణాలలో నుండి బయటకు వస్తాడు. నీకు దేహభావన తగ్గాలంటే ఆత్మభావన పెంచుకోవాలి. నువ్వు కానిదానిలో నుండి విడుదల పొందాలంటే నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక గుర్తింపు నీకు రావాలి. దేహభావన ఉన్నంతసేపు ఏదో కోరిక, ఏదో రకమైన భయం వస్తూనే ఉంటుంది. కొంతమందికి పరిస్థితులు అన్నీ బాగానే ఉంటాయి, భయం వేస్తోంది, భయం వేస్తోంది అంటారు. బాహ్యపరిస్థితులు అన్నీ బాగా ఉన్నప్పుడు ఇంక భయం ఎందుకు? యిదంతా నిజం కాదు, నిజం కానిదానిలో నుండి ఇవి అన్నీ వస్తున్నాయి. ఇదే మాయ, ఇదే ఈశ్వరుడి లీల. అందరి హృదయాలలో ఉన్న అంతర్యామే కృష్ణుడు, వాడే ఈశ్వరుడు, వాడు అనేక రకాల వేషాలు వేసుకొని వస్తాడు. మనం పెళ్లికి పట్టుచీరలు కట్టుకొని వెళతాము, ఇంటిలో మామూలు బట్టలు కట్టుకొంటాము, స్నానానికి వెళ్ళేటప్పుడు తుండుగుడ్డ కట్టుకొంటాము. పట్టుబట్టలు కట్టుకొన్నా, మామూలు బట్టలు కట్టుకొన్నా, తుండుగుడ్డ కట్టుకొన్నా కూడా మనమే. అలాగే భగవంతుడు అనేక రూపాలలో వస్తాడు కాని ఉన్నవస్తువు ఒక్కటే. అందుచేత బేధాలు పెట్టుకోవద్దు, అంతర్యామిగా ఉన్న వాడిని చూడండి, అప్పుడు మీరు తరిస్తారు. కృష్ణుడు రూపం గొప్పది,

రాముడి రూపం తక్కువది అని ఇలా అనుకోకండి. కృష్ణుడు ధర్మాన్ని బోధించాడు, రాముడు ధర్మాన్ని ఆచరించాడు. మామూలుగా మనం జీవితంలో ఎన్ని కష్టాలు పడతామో అన్ని కష్టాలు పడి, వాటిని భరించి చూపించాడు మనకు. అంటే మనకు సహనం నేర్పటం కోసం చేసాడు కాని, ఆ శరీరంలో ఉన్నప్పుడు కూడా ఆయన పరమాత్మ అని ఆ శరీరంతో సంబంధం లేదని ఆయనకి తెలుసు. కాని మనం ఆ శరీరానికి పరిమితమై ఉంటాము. భగవంతుడు చెప్పిన మాటలు అన్నీ మనం బాగుపడటం కోసం, మన నిజమైనఇంటికి మనలను తీసుకొని వెళ్ళటం కోసం చెప్పాడు అనే బుద్ధి మనకు రావటం లేదు. రాముడు, కృష్ణుడు అనేక గొప్ప పనులు చేసారు. ఆ పనులు చేసేటప్పుడు మేము గొప్పపనులు చేస్తున్నాము అని వారు అనుకోలేదు. అలా అనుకొంటే వారు కూడా మనలాంటి వారే. అనుకొనేది జీవలక్షణం. పరమాత్మకు అనుకోవటం అంటూ ఏమీ ఉండదు, వారి ద్వారా పనులు అలా జరిగిపోతూ ఉంటాయి. భగవంతుడు చెప్పిన మాటలను అర్థం చేసుకొని, ఆ మాటల ప్రకారం నీవు జీవిస్తూ ఉంటే నీకు సుఖం, శాంతి కలుగుతుంది, మృత్యువులో నుండి అమృతత్వం పొందుతావు. నీకు ఈశ్వరానుగ్రహం కావాలంటే ఆశ కోసం బతకవద్దు, ఆశయం కోసం బతుకు అని గాంధీగారు చెప్పారు. తినటం కోసం బతకవద్దు, బతకటం కోసం తిను. నీవు తినే ఆహారం కూడా అది నీ సొంతం అనుకొని తినవద్దు, ఈశ్వర ప్రసాదం అనుకొని తిను, నీదంటూ ఈ లోకంలో ఏమీ లేదు.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతసుడితో మాట్లాడుతూ నువ్వు చిన్నవాడివి, ఈ వయస్సులో ఆత్మజ్ఞానం నీకు ఎందుకు, శుభ్రంగా పెళ్ళి చేసుకో, నీకు రాజ్యాలు ఇస్తాను, అనేక భోగాలు ఇస్తాను, ఏనుగులు ఇస్తాను, అన్నీ ఇస్తాను అంటే ఈ గొడవలు అన్నీ వదిలేసి ఆత్మజ్ఞానం అంటావు ఏమిటి, మరణాన్ని జయించాలి అమృతత్వాన్ని పొందాలి అంటావు ఏమిటి అంటాడు. అప్పుడు నచికేతసుడు ఏమన్నాడు అంటే మీరు ఇవన్నీ నాకు ఇస్తారు అనుకోండి, అవిఅన్నీ నిలబడతాయా అన్నాడు. నేను ఉండగా అవి అయినాపోతాయి, అవి ఉండగా నేను అయినా చనిపోతాను. మీరు చెప్పినవన్నీ నేను కోపంమీద వద్దనటం లేదు. కోపం మీద వద్దని చెపితే మరల రేపు కావాలంటాను. నాకు అమృతత్వం తప్పించి ఏదీ వద్దు అని చెప్పాడు. అప్పుడు యముడు ఏమన్నాడు అంటే నచికేతా నేను ఏమాటలు అయితే చెప్పానో వాటిని అన్నింటిని నీవు జయించావు, ఇప్పుడు నీవు ఆత్మజ్ఞానానికి అర్హుడవు అని చెప్పాడు. ఆకలి బాధ కంటే కఠినమైనది అహంకార బాధ. ఆకలిబాధ అయినా పదిరోజులు పడగలం కాని అహంకారబాధ పడలేము. అహంకారంలో నుండి ఎవడైతే విడుదల పొందాడో వాడు అన్ని

బాధలలో నుండి విడుదల పొందుతాడు. అది ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీలేదు. గాంధీగారు చివరిరోజులలో ఒక మాట చెప్పారు. మీరు ఎవరితో అయినా మాట్లాడేటప్పడు మీ భావన వారితో చెప్పండి, మీ భావనలో అహంభావన కలపవద్దు. అహంభావన లేకుండా మీ భావన చెప్పండి మీ భావన చెప్పేటప్పడు అహంభావన అక్కడ ఉందా, అది మీ పతనానికి కారణం అవుతుంది. శివకేశవ బేధం పెట్టుకోవద్దు. ఆ మాయలో పడకండి. లోచూపు నేర్చుకోండి. మీ ఇంటి దగ్గర పనులు ఎంత శ్రద్ధగా చేసుకొంటున్నారో, సమాజపరంగా మీకు ఏమైనా పనులు ఉంటే అవి ఎంత శ్రద్ధగా చక్కబెట్టుకొంటున్నారో భగవంతుడు చెప్పిన మాటల యందు అంత శ్రద్ధ పెట్టుకొని తరించటానికి ప్రయత్నం చేయండి. కలెక్టర్‌గారు ఆఫీసుకు వెళ్తాడు, అక్కడ కూర్చోడు ఇంటికి వచ్చేయాలి. అలాగే మనం కూడా ఈ లోకంలోనికి వచ్చాము, ఎప్పటికయినా మన నిజమైనఇంటికి వెళ్ళవలసిందే. మోక్ష సామాగ్రిని సంపాదించుకో, ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నం చెయ్యి. పొందుతావా ఈ జన్మలోనే పొందుతావు, ఒకవేళ ఈ జన్మలో పొందలేవు అనుకో, ఆ ప్రయత్నంలో మరణించావు అనుకో, వచ్చేజన్మలో అయినా ఆత్మజ్ఞానసముపార్జనకు నీకు యోగ్యత కలుగుతుంది. ముసలితనం వచ్చాక అన్ని కాంక్షలు విడిచిపెట్టినా కీర్తికాంక్ష విడిచిపెట్టదు అని మిల్టన్ చెప్పాడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే కీర్తి వస్తుందంటేనే పనులు చేస్తారు, కీర్తి రాదు అంటే అది మంచిపని అయినా కూడా చేయరు. చావటానికి సిద్ధంగా ఉన్నవారు కూడా కీర్తికి దాసులే. కీర్తికి దాసరికం చేయటం వలన శాంతిని పోగొట్టుకొంటున్నావు, మోక్షాన్ని పోగొట్టుకొంటున్నావు అని నీకు తెలియటం లేదే అంటాడు ఒక డ్రామాలో మిల్టన్. నువ్వు ఏదైనా మంచి పని చేయాలంటే చేసి వదిలెయ్యి. గౌరవాలను లెక్కించవద్దు. అది మంచి పని అని నీవు అనుకొన్నప్పడు దాని వలన గౌరవం రాకపోయినా ఆ పని చెయ్యి. మీరు చనిపోయాక మీ వారసులు మీ అస్థికలను తీసుకొని వెళ్ళి రాజమండ్రి గోదావరిలో పడేస్తారు. మీ గౌరవాలను, అగౌరవాలను, ఈ తక్కువ ఎక్కువలను, గొప్పలను అన్నింటిని మీరు బతికి ఉండగానే తీసుకొని వెళ్ళి రాజమండ్రి గోదావరిలో పడేయమంటున్నారు, అప్పడు వయ్యా నీకు శాశ్వతమైన శాంతి అంటున్నారు. అసలు జ్ఞానం కలగాలి కాని జ్ఞానం కలిగినవాడు మహాత్ముడే, వాడు మహర్షే. ఎందరో మహానుభావులు కొంతమంది వ్యక్తమవుతారు, కొంతమంది వ్యక్తం కారు. జ్ఞాని ఎక్కడ ఉన్నా వాడు సంసారంలో ఉన్నా, సన్యాసం తీసుకొన్నా, వాడు దేహంలో ఉన్నా, వాడికి దేహం లేకపోయినా జ్ఞానే, జ్ఞానం అంటే జ్ఞానమే. మహాత్ములు, మహర్షులు ఎక్కడ ఉన్నా మనం శిరస్సు వంచవలసిందే, వారికి నమస్కరించవలసిందే ఎందుకు అంటే మన మనస్సు అనే పీడ వదలటానికి చేయాలి.

విష్ణుమూర్తి అనేక అవతారాలలో వచ్చాడు. వామనావతారం చూస్తూ ఉంటే సౌందర్యమే వచ్చి భూమిమీద నడుస్తోందా అనిపిస్తుంది. బలిచక్రవర్తి మంచివాడు, గొప్పదాత. నేను గొప్పవాడిని, నేను చేసిన దానాలు ఎవరూ చేయలేరు అనే అహంకారం పెట్టుకొని పాడైపోతున్నాడు, ఆబుద్ధిని పోగొట్టటానికి వామనావతారంలో వచ్చాడు. బలిచక్రవర్తికి నేను మహాదాతను అనే గర్వం ఉంది. ఆ గర్వాన్ని అణిచివేసి తన స్వరూపాన్ని ఇవ్వటానికి వచ్చిన అవతారమే వామనావతారం. బలిచక్రవర్తిని శిక్షించటానికి రాలేదు, బలిచక్రవర్తిని అనుగ్రహించటానికి వచ్చినదే వామనావతారం. ఏమీ అక్కరలేదు, మీలో ఎవరయినా ఒక్కరు మంచివారు ఉన్నారు అనుకోండి మీ ఒక్కరికోసం, మిమ్మల్ని తరింపచేయటం కోసం భగవంతుడు శరీరం ధరించి వస్తాడు, అంత కరుణామయుడు. ఒక్క ప్రహ్లాదుడికోసం లక్ష్మీనరసింహస్వామి అవతారం వచ్చింది. మీరు ఏదో ఒక అవతారాన్ని ఆశ్రయించి, స్మరించి, తరించండి. చేతిలో డబ్బు లేకుండా బజారులో ఉన్న వస్తువును మనం ఆశించకూడదు అలాగే ధర్మాన్ని ఆచరించకుండా శాంతిని ఆశించకూడదు, జ్ఞానాన్ని ఆశించకూడదు. డబ్బు ఏమీలేనివాడు నేను భోగం అనుభవించాలి అనుకోవటం ఎటువంటిదో ధర్మాచరణ లేకుండా నాకు శాంతి కావాలి, జ్ఞానం కావాలి అనుకోవటం అటువంటిది. శాంతి అనేది ఎక్కడో పై నుంచి వచ్చిపడుతుంది అనుకొంటున్నారు. మన ప్రవర్తన మీద, మన జీవితవిధానం మీద, మన రాగద్వేషాలు తగ్గించుకోవటం మీద శాంతి రావటం ఆధారపడిఉంది అనే అవగాహన మనకు రావటం లేదు. డబ్బు వల్ల, విద్య వల్ల శాంతి రాదు. ధర్మాన్ని ఆచరించటం వలన, మన మనస్సును నియమించుకోవటం వలన, క్రమశిక్షణ వలన శాంతి దొరుకుతుంది. శాంతి అనేది బజారులో దొరికే వస్తువు కాదు. శాంతి మీ హృదయంలోనే ఉంది. అది ఎక్కడ ఉందో అక్కడ వెదకండి మీకు దొరుకుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-05, పాతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జ్ఞానం అనేది ఎవరో ఒక వ్యక్తి యొక్క ఆస్తికాదు, జ్ఞానానికి, శాంతికి, ఆనందానికి అందరూ వారసులే. కాని మీరు అనుకోవటాలు వదిలివేయండి. మేం మంచి వాళ్ళం అని, మేం చెడ్డవాళ్ళం అని లేకపోతే మేము గొప్పవారమని, మేము తక్కువవారమని ఇలా అనుకోవటాలు మానివేయండి. ఈ అనుకోవటాలు మానివేస్తే నేను ఈ పుస్తకాన్ని వదిలేస్తే భూమి యొక్క ఆకర్షణశక్తి వలన ఎలా కిందపడిపోతుందో అలాగ, మీరు అనుకోవటాలు మానివేస్తే మీ హృదయంలో ఉన్న వస్తువే మిమ్మల్ని లోపలకు గుంజుకొంటుంది, అప్పుడు మీ మనస్సు వెళ్ళి